www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
5
ఏలూరు



నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేయండి

నారాయణపురం బ్రిడ్జిని సందర్శించిన ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం వంతెన మరమ్మతులు అనంతరం మిగిలిన చిన్న చిన్న పనులను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు సూచించారు. మంగళవారం ఆర్అండ్‌బి డిఇ గోవింద్‌మోహన్‌తో కలిసి వంతెనను ఎంఎల్ఎ పరిశీలించారు. బ్రిడ్జి స్లాబుకు ఇరుపక్కల అప్రోచ్ రోడ్డును తారు రోడ్డుగా వేసి సైడ్ గోడలను పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. కూటమి నాయకులు, వర్తకులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఎంఎల్ఎ

బిల్లుల్లేవు.. జిఎస్‌టి లేదు..!

- మందులపై జిఎస్‌టి తగ్గింపు అమలు శూన్యం
- ఉమ్మడి పశ్చిమలో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్లు
- కొనుగోలుదార్లకు ఎక్కడా బిల్లులే ఇవ్వని పరిస్థితి
- 18,12 శాతం జిఎస్‌టి ఐదు శాతానికి తగ్గింపు
- రెండు జిల్లాల్లో ఎక్కడా అమలు కాని పరిస్థితి
- స్టోర్ల ముందు జిఎస్‌టి తగ్గింపు బోర్డులు ఏర్పాటు చేస్తే మేలు

'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్' పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడికి, క్షేత్రస్థాయి పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. ముఖ్యంగా కేన్సర్‌తోపాటు అరుదైన వ్యాధులకు సంబంధించిన మెడికల్స్ (ఔషధాలు)పై, ఇతర మెడికల్స్‌పై తగ్గిన జిఎస్‌టి ఫలాలు ప్రజలకు ఏమాత్రం అందడం లేదు. ఏఒక్క మెడికల్ స్టోర్‌లోనూ జిఎస్‌టి తగ్గించి మెడిసిన్స్ అమ్మడం లేదు. రోగులు కొనుగోలు చేస్తున్న మెడిసిన్స్‌కు బిల్లులే ఇవ్వని పరిస్థితి ఉంది. బిల్లులు ఇవ్వకుండా జిఎస్‌టి తగ్గిందో, లేదో జనాలకు తెలిసే అవకాశం లేకుండాపోయింది. దీనిపై అధికారుల చర్యలు సైతం తూతూమంత్రంగా అన్నట్లు ఉన్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. మెడికల్ స్టోర్స్‌లో ప్రతిరోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. జిఎస్‌టి 2.0 పేరుతో కేంద్ర ప్రభుత్వం కేన్సర్‌తోపాటు అరుదైన రోగాలకు సంబంధించిన మెడిసిన్స్‌పై జిఎస్‌టిని ఎత్తివేసింది. 12, 18 శాతం శ్లాబులు ఉన్న మెడికల్స్‌పై ఐదు శాతానికి తగ్గించింది. జిఎస్‌టి తగ్గింపు ఫలాలు మాత్రం జనాలకు అందడం లేదు. మందుల దుకాణాల్లో సాగుతున్న నిరంకుశ పోకడలే అందుకు ప్రధాన కారణం. ప్రభుత్వ నిబంధనలేవీ మెడికల్ స్టోర్స్‌లో పాటించడం లేదు. వైద్యులు సూచించిన చీటీ ప్రకారం మెడిసిన్స్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా వీరే రోగులకు మందులు ఇస్తున్న విషయం బహిరంగ రహస్యమే. రోగులు కొనుగోలు చేసిన మెడిసిన్స్‌కు మెడికల్ స్టోర్స్‌లో బిల్లు అనేది ఎక్కడా ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా బిల్లు అడిగితే పెద్ద దాడే జరుగుతోంది. డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఇవన్నీ తెలిసినా మాముళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రెండు జిల్లాల్లో వేల సంఖ్యలో కేన్సర్ రోగులు ఉన్నట్లు ప్రభుత్వం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుల్లో తేలింది. అరుదైన వ్యాధులతో బాధపడుతున్నవారు పెద్దసంఖ్యలో ఉన్నారు. కేన్సర్ రోగులకు సంబంధించిన మెడికల్స్‌కు జీరో జిఎస్‌టి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదని రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కొనుగోలు చేసిన మెడిసిన్స్‌కు బిల్లులే ఇవ్వకపోతే జిఎస్‌టి తగ్గిందో, లేదో ఏవిధంగా తెలుస్తుందని వారంతా ప్రశ్నిస్తున్నారు. రెండు



రోజుల క్రితం డ్రగ్ కంట్రోల్ అధికారులు చింతలపూడి, ఏలూరులోని మెడికల్ స్టోర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. చింతలపూడిలో ఎనిమిది, ఏలూరులో ఒక మందుల దుకాణంలో జిఎస్‌టి తగ్గింపు లేకుండా మెడికల్స్ విక్రయించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల దుకాణాలు ఉన్నాయి. మిగిలిన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తే జిఎస్‌టి దందా మరింత స్పష్టంగా బయటపడుతుంది. మెడికల్ స్టోర్స్‌పై అధికారుల దాడులు తూతూమంత్రంగానే సాగుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరులో మెడ్‌ప్లస్ వంటి కొన్ని మెడికల్ స్టోర్స్‌లో తప్ప ఫైర్ స్టేషన్‌లో ఉన్న ప్రధాన మెడికల్ దుకాణాల్లో ఎక్కడా బిల్లులు ఇవ్వడం లేదు. జిఎస్‌టి తగ్గించని పరిస్థితీ కన్పించడం లేదు. దీంతో జిఎస్‌టి తగ్గినా జనానికి ఎటువంటి మేలూ జరగడం లేదు. జిఎస్‌టి తగ్గింపుపై చేస్తున్న హడావుడి తగ్గించి అమలుకు సంబంధించి చర్యలు చేపడితే జనానికి మేలు జరుగుతుందని చెప్పొచ్చు.

మెడికల్ స్టోర్ ముందు బోర్డులు పెడితే కొంత మేలు

ప్రతి మెడికల్ స్టోర్ ముందు ఏ మెడిసిన్స్‌కు సంబంధించి జిఎస్‌టి తగ్గిందో బోర్డులు ఏర్పాటు చేసినప్పుడే జనాలు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. మెడికల్‌స్టోర్స్ ముందు బోర్డులు పెట్టేవిధంగా అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. మెడికల్ స్టోర్స్‌కు వెళ్లేవారికి అవగాహన కలగాలంటే బోర్డులు ఏర్పాటు తప్పనిసరి. అప్పుడే మెడికల్ స్టోర్స్ యజమానులకు సైతం భయం ఉంటుంది. మెడికల్ స్టోర్స్ యాజమాన్యాలకు, సంబంధిత శాఖాధికారులకు మధ్య ఎప్పటి నుంచో అవగాహన నడుస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కారణంగానే మెడికల్ స్టోర్స్‌లో నిబంధనలు అమలు చేయకపోయినా పట్టించుకోని పరిస్థితి కొనసాగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిఎస్‌టి తగ్గింపుపై సైతం ఒకటి, రెండురోజులు తూతూమంత్రపు తనిఖీలు చేసి వదిలేస్తారు. తర్వాత షరా మామూలు అన్నట్లు పరిస్థితి తయారవుతుందనడంలో ఎటువంటి సందేహామూ అక్కర్లేదు.

బిల్లులు లేకుండా ఆడిట్ ఎలా?

ఏ వ్యాపార సంస్థ అయినా తన అమ్మకాలపై ప్రతియేటా ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది. విక్రయించిన ప్రతిదానికి సంబంధించి బిల్లులు ఆడిట్‌లో చూపించాల్సి ఉంటుంది. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులే ఇవ్వడం లేదు. అటువంటప్పుడు ప్రతియేటా ఆడిట్ ప్రక్రియ ఏవిధంగా నిర్వహిస్తున్నారో తేలాల్సి ఉంది. తప్పుడు పద్ధతుల్లోనే ఆడిట్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆడిట్ వ్యవహారాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగులు నేటి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక నెలలుగా దశలవారీ ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపుమేరకు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 2004 ఆగస్టు 31వ తేదీ మధ్య విద్యుత్ సంస్థలలో నియమితులైన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలె జిపిఎఫ్, పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సంతృప్తికర నగదురహిత అపరిమిత వైద్య సౌకర్యాన్ని తక్షణమే అమలు చేయాలని, యూనియన్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం గత మూడు దశాబ్దాల నుంచి అమలు జరుపుతున్న పద్ధతి ప్రకారం పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలు మంజూరు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొత్తం 15 డిమాండ్లతో విద్యుత్ ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. ఉన్నతాధికారులతో చర్చలు విఫలమైతే బుధవారం ఉదయం నుంచి సమ్మె ప్రారంభమవుతుందని ఐదు జిల్లాల డిస్కం జెఎసి కన్వీనర్ భూక్య నాగేశ్వరరావు నాయక్ తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, గ్రేడ్2 జేఎల్ఎం ఇతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న సమ్మెలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కూడా పాల్గొంటుందని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, నాయకులు జి.మోహన్, పి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

సిఐటియు మద్దతు

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నుంచి చేపట్టబోయే సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు పోకుండా తక్షణమే ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - ముదినేపల్లి


వినతి అందిస్తున్న మహంకాళిరావు, కౌలు రైతులు

అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు కౌలు రైతులకు జమ చేయాలని, నూతన కౌలు చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహంకాళిరావు మాట్లాడుతూ కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతుల కష్టాలు తీర్చుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి అధికారం చేపట్టిన ఏడాది దాటినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణం కొత్త కౌలుచట్టం తీసుకురావాలని కోరారు. భూయజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు చిన్నం మాధవ, జక్కుల మహేష్, అనగాని శ్రీరామ్మూర్తి, రాజులపాటి ఏడుకొండలు, మట్టా మల్లేష్, పల్లి రంగారావు, బొంతు రంగారావు, బొంతు మహేష్, పల్లి సురేష్, నక్కా నాగులు, నక్కా అప్పారావు, రాజులపాటి శ్రీనివాసరావు, గురప రామారావు పాల్గొన్నారు.

బాలికలకు హక్కులు, విద్య అందాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి బాలికకు సమాన హక్కులు, విద్య, ఆరోగ్యం అందాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పిజె.అమృతం అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సేవ్ ద గర్ల్ చైల్డ్ పైన అవగాహన కార్యక్రమం చాటపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పిజె.అమృతం మాట్లాడుతూ ఆడపిల్లలుగా పుట్టడం అదృష్టమని, బాలికలు సమాజానికి ఆధారం, కుటుంబానికి గౌరవమని చెప్పారు. ప్రతి బాలికకు సమాన హక్కులు, విద్య, ఆరోగ్యం అందాలన్నారు. బాలికల జననాన్ని ప్రోత్సహిస్తూ లింగ సమానత్వం సాధించే దిశగా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి, చెడు స్పర్శలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది చే ప్రతిజ్ఞ చేయించారు

ప్రణీత్‌కు గిరిజన, దళిత సంఘాల మద్దతు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



దీక్షలో బాధితులు, నాయకులు

కుంజ ప్రణీత్‌కు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు గిరిజన, దళిత సంఘాలు మంగళవారం మద్దతు తెలిపారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి తగరం బాబూరావు దాదాపు ఎనిమిది రోజులుగా తహశీల్దార్ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో నిరాహార దీక్ష చేస్తున్న కుంజ ప్రణీత్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంజ సోమరాజుకు, ప్రమీలరాణిలకు 2014 మార్చి 15వ తేదీన కలిగిన సంతానం కుంజ ప్రణీత్ అని కోర్టు ఆర్డర్ క్లియర్ గా ఇచ్చిందని చెప్పారు. కోర్ట్ ఆర్డర్‌ను అమలు చేసి ప్రణీత్‌కు ఎస్‌టి సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కమిటీ సభ్యులు బన్ని వినోద్, ప్రణీత్ అమ్మమ్మ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ వ్యవస్థ, నోడల్ ఏజెన్సీలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి పారిశ్రామిక భద్రతా కమిటీ, క్రైసిస్ గ్రూపుల కమిటీ సమావేశాన్ని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, సేఫ్టీ అధికారులతో కలిసి కలెక్టర్ తన అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ఎ కేటగిరిలో 4, బి1 కేటగిరిలో 26, బి2 కేటగిరిలో 6 మొత్తం 36 పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఫ్యాక్టరీకి తప్పనిసరిగా భద్రతా అధికారిని నియమించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను అమలు చేసి రొటీన్‌గా మాక్‌డ్రిల్‌లు నిర్వహించాలన్నారు. భద్రతా వృత్తాలు, జోన్లు ఏర్పాటు చేయాలని, ప్రజలు కూడా ప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ అలారం సిస్టమ్ సజావుగా పని చేయడం, సెన్సర్ యాక్టివేషన్ ద్వారా జిల్లా అధికారులను అప్రమత్తం చేయడం వంటి అంశాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. భద్రతా చర్యలపై ప్రతి ఫ్యాక్టరీ 30 రోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలని, ఈ నెలలో ప్రతి ఫ్యాక్టరీలో మాక్ డ్రిల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనిలో ఆన్-సైట్, ఆఫ్-సైట్ భద్రతా చర్యలు, మాక్‌డ్రిల్ ఫలితాలు, హెచ్చరిక వ్యవస్థ పనితీరుపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఆటోమేటిక్ అలారం, ఎస్ఎంఎస్ సిస్టమ్ ద్వారా సంబంధిత అధికారులు వెంటనే అప్రమత్తం కావాల్సిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి కె.కృష్ణమూర్తి, ఐటిడిఎ పిఒ కె.రాములు నాయక్, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కె.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంటు అధికారి ఎన్.జితేంద్రబాబు, జిల్లా మత్స్యశాఖ డిడి బి.నర్సయ్య, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎస్‌బి.శేఖర్, వివిధ శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు

సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా స్థాపించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కులు నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జెసి ఎంజె.అభిషేక్‌గౌడ, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భారతీయ వారసత్వం లౌకిక రాజ్యం

- పాలకుల విధానాలతో లౌకిక రాజ్యానికి తూట్లు
- రాజ్యాంగానికి విరుద్ధంగా ఎన్నికల కమిషన్ వైఖరి
- కోర్టు తీర్పును ప్రభుత్వమే ఉల్లంఘిస్తే శిక్షించేది ఎవరు
- లౌకిక సదస్సులో మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ
- సమైక్యతా స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడాలి
- దారి దీపం ఎడిటర్ డివిఎస్.వర్మ



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉన్న రాజ్యాంగంలో లౌకిక రాజ్యం భారతీయ వారసత్వమని మాజీ ఎంఎల్‌సి, ప్రజాశక్తి పూర్వ ఎడిటర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో లౌకిక వేదిక ఆధ్వర్యంలో లౌకిక సదస్సును మంగళవారం నిర్వహించారు. సదస్సుకు దారి దీపం మాసపత్రిక సంపాదకులు డివిఎస్.వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో లౌకికత్వం అనే పదం లేదని ఒక వ్యక్తి వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి లౌకికత్వం, ప్రజాస్వామ్యం ప్రతిరూపాలన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి వచ్చిన వారు రాజ్యాంగానికి లోబడి పరిపాలన చేయకుండా దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చినప్పుడు దానిలో పాల్గొన్న ప్రజానీకం ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధంగా వేయాల్సిన ఓటు హక్కు ప్రమాదంలో పడిందని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్‌నే దీనికి కారణమని అన్నారు. రాజ్యాంగాన్ని పిల్లలకు ఆస్తిగా సంక్రమించేదిగా చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 8 గంటల పని దినాలుగా ఉన్న హక్కుని 13 గంటలకు పెంచుతూ కార్మికుల హక్కులను తుంగలోకి తొక్కుతూ కూటమి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. కొత్త తరానికి రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని తెలియజేయాలన్నారు. పెన్షనర్లను విభజించే హక్కు లేదని 1982లో సుప్రీంకోర్టు చెప్పిందని, ఈ తీర్పునకు వ్యతిరేకంగా ప్రస్తుతం రివ్యూ పిటీషన్ కేంద్ర ప్రభుత్వం వేసిందన్నారు. అదానీ, అంబానీలకు మాత్రం అన్ని రకాల భూములు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 2023లో అదానీ అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డితో విద్యుత్ ఒప్పందాన్ని చేసుకున్నారని, దీనివల్ల సుమారు రూ.పది లక్షల కోట్లు నష్టపోతామని విద్యుత్ శాఖాధికారులు చెప్పినా జగన్ వినకుండా రూ.7,500 కోట్లు తీసుకుని ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. దీనిపై అమెరికా ఎఫ్‌బిఐతో విచారణ చేసి కేసు నమోదు చేసిందని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై కనీసం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కోర్టు తీర్పును ప్రభుత్వమే ఉల్లంఘిస్తే శిక్ష ఎవరు వేస్తారని ప్రశ్నించారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వల్ల సమసమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి రకరకాల సిలబస్ తీసుకొస్తున్నారని, అయితే ఆయా ప్రాంతాలకు తగినట్టుగా సిలబస్ ఉండాలని చెప్పారు. వైద్యం కూడా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు. ట్రంప్ సుంకాలు వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అయితే మోడీ, చంద్రబాబు ట్రంప్ సుంకాలపై కనీసం మాట్లాడకపోవడం దారుణమన్నారు. సదస్సులో జెవివి నేత ఎర్ర అజయకుమార్, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సమైక్యత స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడాలి..

డివిఎస్.వర్మ, దారి దీపం ఎడిటర్

రాజ్యాంగాన్ని మనమే రాసుకున్నాం. దానికి మనమే యజమానులు. రాజ్యాంగం ఏం చెబుతుంది, ఏం జరుగుతుందో ఆలోచించాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం రాజ్యాంగం కల్పించింది. రాజ్యాంగ విలువలు రాజ్యాంగంలో పొందుపర్చారు. దేశ ప్రధాని హిందూ జాతీయవాదిగా ప్రకటించుకున్నారు. ఇది లౌకికరాజ్యానికి విరుద్ధం. లౌకిక రాజ్యంలో వాటికి దూరంగా ఉండాలి. హిందూ జాతీయవాదం కోసం మాట్లాడుతారుగాని భారత జాతీయవాదం కోసం మాట్లాడరు. మతోన్మాద దేశంగా మార్చే ప్రయత్నాలు సాగిస్తున్నారు. గాంధీ సనాతన హిందువుగా ప్రకటించుకున్నారుగాని లౌకికరాజ్యం కోసం చెప్పారు. ప్రస్తుతం లౌకికరాజ్యంపై దాడి జరుగుతుంది. హిందూ రాజ్యాంగం కోసం ఒక ముసాయిదా తయారు చేశారు. సాధిస్తామని చెప్పారు. మనుధర్మ శాస్త్రానికి, రామ రాజ్యానికి, క్వాంటం అర్థ రాజ్యానికి ఇది పునాదిగా చెబుతున్నారు. సనాతన హిందువు అయితేనే చట్టసభలకు అర్హులు. హిందూ రాష్ట్రంలో రాజ్యాంగం ఉండదు. ప్రజాస్వామ్యం పౌర హక్కులు, రాజ్యాంగ విలువలు, హక్కులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. సమైక్యతా స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

రాజ్యాంగంపై బహుముఖ దాడి..

ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం

రాజ్యాంగం అమలైతే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం నయా ఫాసిజం రాజ్యమేలుతుంది. మతం ముసుగులో ఫాసిజం రాజ్యమేలుతుంది. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలు కొట్టేసే విధంగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి. లౌకిక విధానంపై దాడి చేస్తున్నారు. రామాలయ నిర్మాణంలో సుప్రీంకోర్టుసైతం రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించి తీర్పునిచ్చింది. సర్వ బహుమత్వం అనేది కన్పించట్లేదు. అమెరికాకు బిజెపి లొంగిపోయింది. ట్రంప్ ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నా కనీసం నోరు మెదపట్లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్న పరిస్థితి ఉంది. రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి బహుముఖ దాడి జరుగుతుంది. దీన్ని తిప్పికొట్టాలి.

ఓటు హక్కు కూడా నిర్ణయం వారిదే..

ప్రముఖ వైద్యులు బి.రమేష్ చంద్రబాబు

స్వతంత్ర వ్యవహ రించాల్సిన సంస్థలను పాలకులు గుప్పెట్లో పెట్టుకోవడం అన్యాయం. ఎవర్ని నిజాయితీగా ఉండనీకుండా చేయడం దారుణం. చివరకు ఓటుహక్కు కూడా వారే నిర్ణయిస్తే ఎలా. ఓటిచ్చే అధికారం వీళ్లకు ఎక్కడి నుంచి వచ్చింది. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న పరిస్థితి. రాజ్యాంగం పరిరక్షణకు, అమలుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

మానవులంతా ఒక్కటే..

ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ హుస్సేన్

రాజ్యాంగంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో స్వాతంత్ర పోరాటంలా మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలు చేస్తున్న రోజులివి. ఏ గ్రంథం చెప్పిన మానవులంతా ఒకటేనని చెబుతుంది. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి మానవులను వేరు చేయడం ఎంతవరకు సమంజసం. అంతా కలిసికట్టుగా ఉండి రాజ్యాంగం విలువలను కాపాడుకోవడంతోపాటు లౌకిక రాజ్యంపై జరుగుతున్న దాడి వ్యతిరేకించేందుకు కృషి చేయాలి.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం..

సామాజిక న్యాయ పోరాట వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.మురళి

ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించి దానికి అనుకూలంగా నడుచుకోవాలి. మన విలువలు రాజ్యాంగంతో ముడిపడి ఉన్నాయి. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. దీన్ని పరిరక్షించుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలి.

రాజ్యాంగ ప్రచార వేదిక కమిటీ ఎన్నిక

లౌకిక వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లౌకిక సదస్సులో రాజ్యాంగ ప్రచార వేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా దారి దీపం మాసపత్రిక ఎడిటర్ డివిఎస్.వర్మ, సభ్యులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్ చంద్రబాబు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు హుస్సేన్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాతల జేమ్స్, మహ్మద్ సిద్ధిక్, మురళీకుమార్, అజయ్ కుమార్ ఎన్నికయ్యారు.

అక్రమ చెరువులతో మా కొంపలు ముంచారు

ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి

చేవూరు కాలనీవాసుల రాస్తారోకో

ప్రజాశక్తి - ముదినేపల్లి


రోడ్డుపై బైఠాయించిన చేవూరు కాలనీవాసులు

ప్రభుత్వ అనుమతులు లేకుండా కాలనీని ఆనుకుని చేపల చెరువులు తవ్వి మా కొంపలు ముంచారంటూ మండలంలోని చేవూరు వైఎస్ఆర్ కాలనీ వాసులు వడ్లమన్నాడు- సింగరాయపాలెం ఆర్అండ్‌బి రహదారిపై మంగళవారం బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బడాబాబులు ఆరు నెలల క్రితం కాలనీలోని నివాసాలను ఆనుకుని అనుమతులు లేకుండా 30 ఎకరాల్లో ఆక్వా చెరువులు తవ్వారన్నారు. ఆక్వా చెరువులు తవ్వరాదంటూ తాము అభ్యంతరాలు చెప్పినప్పటికీ మా మాట లెక్కచేయకుండా పోలీసుల బలగాలతో తమను భయపెట్టి ఆక్వా చెరువులు తవ్వారన్నారు. చెరువుల తవ్వకం సమయంలో కాలనీ వాసులకు ముంపు ఇబ్బంది లేకుండా డ్రెయినేజీ తవ్వి మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. చెరువుల తవ్వకాలు పూర్తయిన తరువాత తవ్విన మురికిబోదె రైతులు పూడ్చివేశారన్నారు. దీంతో చెరువుల్లో ఊట వర్షపు నీరు బయటకు పారుదల లేక కాలనీని ముంచెత్తిందన్నారు. దీంతో ముంపు నీరు నివాసాల్లోకి చేరడంతో పాములు, విష పురుగులు ప్రవేశించాయని, వీటితో ప్రాణ భయంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నివాసాల్లోకి నీరు చేరడంతో పిల్లాపాపలతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు చెప్పారు. చెరువులు తవ్వే వరకు ముంపు సమస్య లేకుండా, కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాట ఇచ్చి, చెరువుల తవ్వకాలు పూర్తయిన తర్వాత మాట మార్చి తమను కష్టాలపాలు చేస్తున్నారన్నారు. చెరువుల తవ్వకాల సమయంలో అడ్డుకుంటే తమపై అప్పటి ఎస్ఐ రౌడీ షీట్ ఓపెన్ చేసి జైలులో వేస్తామని బెదిరించారన్నారు. అధికారులు న్యాయం చేయాలని, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది రాస్తారోకో విషయం తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రోజు విధులకు హాజరయ్యేందుకు వచ్చే చేవూరు మార్గంలో రాకుండా వేరే మార్గంలో ముదినేపల్లి వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు గ్రామస్తుల వరకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని సంప్రదింపులు చేశారు. అయినా కాలనీ వాసులు ఈరోజే తమకు శాశ్వత ముంపు సమస్య పరిష్కారం చేయాలంటూ పట్టుబట్టారు. ఎంఎల్ఎ ఢిల్లీలో ఉన్నా కారణంగా ఈ విషయం ఎంఎల్ఎ పిఎ దృష్టికి వెళ్లడంతో ఆయన గ్రామ సర్పంచికి ఫోన్ చేసి బుధవారం తహశీల్దార్ వచ్చి సమస్య పరిష్కరిస్తారని, ఆందోళన విరమించాలని కోరారు. బుధవారం ఉదయం వచ్చి కాలనీవాసులకు ముంపు సమస్య తలెత్తకుండా పాత డ్రెయినేజీని తవ్వించి సమస్య పరిష్కరిస్తానని తహశీల్దార్ ఫోన్ చెప్పినట్లు సర్పంచి గ్రామస్తులకు చెప్పటంతో రాస్తారోకో విరమించారు. మూడు గంటలకుపై జరిగిన రాస్తారోకోతో రహదారిలో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆందోళన విరమించిన అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

18న వ్యకాస మండల మహాసభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 18వ తేదీన మండల కేంద్రమైన ఆగిరిపల్లి సుందరయ్య నిలయం (ప్రజా సంఘాల కార్యాలయం)లో జరిగే ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆరో ఆగిరిపల్లి మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు జహంగీర్ భాషా, అర్జునరావు, బదరున్నీషా, వర్గిన్, సన్నీ, సాల్మన్, భూషణం బాబు, మోహన్‌రావు, కృష్ణారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

యుక్త వయసు వచ్చేవరకు మహిళలకు పెళ్లి చేయరాదని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి చెప్పారు. మండలంలోని చిల్లబోయినపల్లిలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు 18 ఏళ్ల నిండి 19 ఏళ్ల వయస్సు రావాలని, అలాగే మగవారికి 21 ఏళ్ల నుండి 22 ఏళ్ల వయస్సు రావాలని, అప్పుడే వారు వివాహానికి అర్హులని చెప్పారు. బాల్య వివాహం చేసే పుట్టిన బిడ్డకు, తల్లికి ఇద్దరికీ అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. పలు కారణాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షురాలు కస్తూరి, టిడిపి గ్రామ అధ్యక్షులు మానం వెంకటేశ్వరావు, నాయకులు గరికిముక్కు నాని పాల్గొన్నారు.

ఎఫ్‌ఎ-2 పరీక్షల నిర్వహణ తీరు పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు

కెజిబివి పాఠశాలలో ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను పగడ్బందీగా, క్రమశిక్షణతో నిర్వహించాలని హెడ్‌మాస్టర్లకు, టీచర్లకు ఎంఇఒ ఎం.కృష్ణప్రసాద్ సూచించారు. పరీక్షల నిర్వహణ తీరును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సమిష్టి నాయకత్వం ద్వారా పరీక్షా ప్రక్రియ మొత్తం సజావుగా సాగేలా చూడాలని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని రిటైర్డ్ ఎస్‌ఐ మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని వేగవరం గ్రామం జల్లేరు వంతెన వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం... అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ నార్లపాటి జగ్గారావు (60) బైక్‌పై తన భార్యతో కలిసి మంగళవారం ఉదయం గురువాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వేగవరం జల్లేరు వంతెన వద్దకు వచ్చేసరికి మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో తాడువాయి నుంచి వేగవరం వస్తున్న మరో ద్విచక్రవాహనానికి బలంగా ఢీకొట్టడంతో నార్లపాటి జగ్గారావుకు తీవ్ర గాయాలయ్యాయి. జగ్గారావును స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. వేగవరం గ్రామానికి చెందిన మరో ద్విచక్రవాహనదారుడు పాల వెంకన్నబాబుకు, జగ్గారావు భార్య సరోజినికి గాయాలయ్యాయి. జగ్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మద్యానికి బానిసై అనారోగ్యానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన పి.రాజవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యువకుడు దోసూరి రాజు(మోటు)(25) చదువు మానేసి కూలి పనులు చేస్తూ కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. అయితే సోమవారం ఫుల్‌గా మద్యం తాగి స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

యూనియన్ బ్యాంకులో మంటలు

అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని యూనియన్ బ్యాంకులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో మంటలు అదుపు చేశారు. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని శనివారపుపేట రోడ్డులో సెయింట్ ఆన్స్ కళాశాల పక్కనే యూనియన్ బ్యాంకు ఉంది. మంగళవారం ఉదయం ఒక్కసారిగా ఆ బ్యాంకులో మంటలు చెలరేగి బయటకు పొగలు వస్తుండడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని, రూ.రెండు నుంచి రూ.మూడు లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

గోగులంపాడులో చోరీ

ప్రజాశక్తి - ముసునూరు

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలకొట్టి బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటన మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గోగులంపాడు గ్రామానికి చెందిన ఎలమంచిలి జగదీష్, నళిని కుమారి దంపతులు ఈ నెల 12వ తేదీన వారి ఇంటికి తాళం వేసి వారి బంధువుల ఇంటికి నూజివీడు వెళ్లారు. వారు తిరిగి మరుసటి రోజు 13వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో ఉన్న బీరువా తాళాలు పగల కొట్టి ఉండగా అందులోని ఒక కాసు బంగారపు చైను, రెండు వెండి గిన్నెలు, ఒక కుంకుమ బరిణి, రూ.ఎనిమిది వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితులు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి, ఎఎస్ఐ బేగు, సిబ్బంది ఘటనా స్థలానికి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు వస్తువులు పోగొట్టుకున్న మహిళ

తిరిగి అందించిన పోలీసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రెండు బంగారపు గాజులు, ఒక బంగారు గొలుసు పోగొట్టుకున్న మహిళకు పోలీసులు తిరిగి అందించారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణానికి చెందిన ముష్వ శ్రీలక్ష్మి తన భర్తబైక్‌పై మంగళవారం జంగారెడ్డిగూడెం బయలుదేరింది. ఈ క్రమంలో వారు నరసన్నపాలెం వద్దకు వెళ్లేసరికి బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఇద్దరికీ స్వల్ప గాయాలేకావడంతో వారు అక్కడి నుంచి బైక్‌పై వెళ్లిపోయారు. తర్వాత చేతికి ఉన్న రెండు బంగారు గాజులు, మెడలో ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ఆ గాజులు, గొలుసు ఒక వృద్ధురాలి వద్ద ఉన్నట్లు గుర్తించి ఆమె నుంచి తీసుకుని బాధిత మహిళకు అందించారు. ఎవరో పడేసుకున్నారని, ఎవరైనా అడిగితే ఇద్దామని ఆ వృద్ధురాలు వాటిని జాగ్రత్త చేసినట్లు పోలీసులు తెలిపారు. బంగారు వస్తువులు తిరిగి ఇచ్చిన ఎస్ఐ చంద్రశేఖర్‌కు, సిబ్బందికి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి


ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు పలువురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కొయ్యలగూడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎర్రంపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బంది మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో పలువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2600 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల కుటుంబం

తల్లిదండ్రుల బాటలోనే ఇద్దరు కుమారులు

వారికి పలువురి అభినందన



తల్లిదండ్రులతో కుమారులు

ప్రజాశక్తి - ఏలూరు

లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని ఆ లక్ష్య సాధనకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ ప్రకారం లక్ష్యసాధనలో ముందడుగు వేసి లక్ష్యాన్ని చేరుకోవడం విజేతలకు వెన్నతో పెట్టిన విద్య. ఉపాధ్యాయులైన తల్లిదండ్రుల బాటలోనే వారి ఇద్దరు కుమారులు కూడా ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడం అభినందనీయం. వారందరూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సభ్యులు కావడం గర్వకారణం. ఎండి రెహమాన్ పెదపాడు మండలం కొక్కిరపాడు పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య షేక్ షకీలా ఏలూరు రూరల్ మండలం మరడాని రంగారావు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వృత్తి రీత్యా వీరిద్దరూ ఉపాధ్యాయులు. ప్రవృత్తి రీత్యా ఈ దంపతులిరువురు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ శాశ్వత కుటుంబ సభ్యులు. ఆ ఫెడరేషన్ నిర్వహించే ఏ కార్యక్రమంలోనైనా వారు తప్పనిసరిగా భాగస్వాములవుతారు. వారిది ఓ అందమైన ఉమ్మడి కుటుంబం. వారిని దగ్గర నుంచి చూస్తూ వారి వృత్తి నిబద్ధతను ఇద్దరు కుమారులు నిత్యం పరిశీలిస్తూ పెరిగారు. రెండో కుమారుడు మహమ్మద్ లతీఫ్ 2024 తెలంగాణ డిఎస్‌సిలో నాన్ లోకల్ కోటాలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం పొంది హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు. మరో ప్రయత్నంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి-2025లో తన సహోదరుడిని కూడా ప్రేరేపిస్తూ తాను కూడా పగడ్బందీగా ప్రిపేర్ అయి మంచి ర్యాంకులు సాధించి నేడు ఏలూరు గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఎంపికవ్వడం ఎంతో సంతోషకరం. ఈ వార్త తల్లిదండ్రులకు ఎనలేని సంతోషాన్ని ఇచ్చింది. అదే సమయంలో తన సహోదరుడు (అన్నయ్య) మహమ్మద్ సాదిక్ కూడా తల్లిదండ్రులను, తన సహోదరుడను దగ్గర నుంచి గమనించి తాను కూడా ఎలాగైనా ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని బలమైన దృఢ సంకల్పంతో ప్రయత్నించి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం విశేషం. ఇద్దరు అన్నదమ్ములు ఏలూరు నగరంలో గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకం.


ఎంతో గర్వకారణం

జొన్నకూటి రాజారావు

లక్ష్యం ఏర్పాటు చేసుకోవడమే కాదు. ఆ లక్ష్యసాధనలో తల్లిదండ్రుల నుంచి స్ఫూర్తిని పొంది వారు చేస్తున్న వృత్తిని తాము కూడా చేయాలనే సంకల్ప బలంతో వెరువని ప్రయత్నించి 2025 మెగా డిఎస్‌సిలో వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకుని పట్టు వదలని విక్రమార్కునిలా విజయం సాధించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ కుటుంబంలోకి ప్రవేశించడాన్ని ఫెడరేషన్ సభ్యులుగా ఎంతో గర్వంగా భావిస్తున్నాం. ఒక్క ఉద్యోగం సాధించడమే కష్టమైన ఈ రోజుల్లో ఒకే కుటుంబంలో పుట్టిన అన్నదమ్ములు ఇద్దరు ఒకే వృత్తిని ఎంచుకోవడం అంతేకాకుండా ఆ వృత్తిలో తమ తల్లిదండ్రులు ఉండడం, ఆ వృత్తినే వారు దైవంగా భావించడం విశేషం. ఏది ఏమైనా ఆ ఇరువురిని అభినందించకుండా ఉండలేం. వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ పక్షాన ధన్యవాదాలు తెలుపకుండా ఉండలేం. ప్రయత్నిస్తే సాధించలేనిదంటు ఏదీ లేదు. దానికో ఉదాహరణ ఈనాటి ఈ విజయం. ఈ విషయంలో ప్రధాన భాగస్వాములైన ఉపాధ్యాయ కుటుంబానికి శతకోటి వందనాలు.

ఘనంగా చెంచు రామారావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - కలిదిండి



రామారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

రాష్ట్ర గౌడ సంఘం వైస్ ఛైర్మన్, వైసిపి కైకలూరు నియోజకవర్గ నాయకులు పోసిన చెంచురామారావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జై గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు పరసా వీర్రాజు, గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పోలగాని నాగరాజు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు కట్టా నాగబాబు, పరసా ఏడుకొండలు, బొర్రా సత్యనారాయణ, కట్టా పాండురంగారావు, జనసేన కైకలూరు ఉపాధ్యక్షురాలు సొంటు రాజేశ్వరి, రాచపట్నం సర్పంచి అల్లూరి మంగారావు, పడమటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పోసిన చెంచు రామారావు యూత్ ఆధ్వర్యంలో తామరకొల్లు మదర్ థెరిస్సా వృద్ధాశ్రమానికి క్వింటా బియ్యం, వృద్ధులకు పండ్లు అందించారు. కలిదిండిలోని బాలుర, బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కైకలూరు పెద్దాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనాథ బాలలకు మధ్యాహ్న భోజనం అందించారు. ఎస్‌సి కాలనీలో సుమారు 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పామర్తి రాంబాబు, మారగాని గణపతి, దాసరి శ్రీనివాస్, వీరంకి సత్యనారాయణ, పోసిన సాయి పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యార్థి దశ నుంచి గుడ్, బ్యాడ్ టచ్‌లపై వారికి సమగ్ర అవగాహన కల్పిస్తే వారు స్వీయ రక్షణ పొందే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో పాఠశాలల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు తెలిపారు. నగరంలోని అమీనాపేటలో ఉన్న కెకెఆర్ గౌతమ్ పాఠశాలలో శక్తి టీమ్, ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఎఎస్‌పితో పాటు త్రీ టౌన్ సిఐ కోటేశ్వరరావు, శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి ఎస్ఐ నాగమణి స్వీయ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి చెడుల గురించి అవగాహన కల్పిస్తే వారు భవిష్యత్తులో నేరా ఆలోచన చేసే వారిని ఇట్టే పసిగట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెకెఆర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, శక్తి టీమ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా మందుగుండు సామగ్రి విక్రయించొద్దు : సిఐ

ప్రజాశక్తి - టి.నరసాపురం

అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచా దుకాణాల స్థలాలను మంగళవారం ఎస్ఐ ఎం.జయబాబు, తహశీల్దార్ టి.సాయిబాబా సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా సామగ్రి దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని, దుకాణాలు నివాస గృహాలు, స్కూల్స్, పెట్రోల్ బంకులకు దూరంగా 50 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతిషాపులో అగ్ని నిరోధక సామగ్రి ఉంచాలని తెలిపారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక బిందెలు తప్పనిసరిగా ఉంచాలన్నారు. షాపుల వద్ద ధూమపానం, దీపాలు వెలిగించడం, మొబైల్ వాడకం నిషేధమన్నారు. విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు విఆర్ఓ ఫణికుమార్, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తిరుమలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు పాఠశాల ఆన్‌లైన్ పనులకు ఉపయోగపడేందుకు వీలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జంగారెడ్డిగూడెం టౌన్ బ్రాంచ్ మేనేజర్ పి.రమాసతీష్‌కుమార్ సుమారు రూ.30 వేల విలువైన కంప్యూటర్ బహూకరించారు. వారి దాతృత్వాన్ని ఎస్‌ఎంసి ఛైర్మన్ వెలగల సత్యనారాయణ, సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భీమరాజు, గ్రామ పెద్దలు, దాతలు అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ జంగారెడ్డిగూడెం టౌన్ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వినికిడి ఉపకరణాల పంపిణీ


ప్రజాశక్తి - దెందులూరు

కీర్తిశేషులు గోవింద రాజులు సామి జ్ఞాపకార్థం, చికాగో (అమెరికా)లో నివసిస్తున్న డాక్టర్ భారతిసామి మానవతా దృక్పథంతో విరాళం అందించారు. ఏలూరులోని దొండపాడులో ఉన్న పరివర్తన వికలాంగుల పాఠశాలలోని 11 మంది వినికిడి లోపం ఉన్న పిల్లలకు వినికిడి ఉపకరణాలను అందించారు. ఆర్‌డిఒ డాక్టర్ అంబరీష్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ డాక్టర్ భారతి సామి విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సొంత ప్రాంతంలోని వికలాంగుల అవసరాలను గుర్తించి ఇలాంటి గొప్ప సాయం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ వినికిడి ఉపకరణాలు పిల్లల జీవితాల్లో వెలుగులు నింపి, వారిని సమాజంలో భాగస్వామ్యం చేస్తాయన్నారు. బి.రామ్‌కుమార్ మాట్లాడుతూ వికలాంగులమనే భావన వీడి సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. దాత భారతి సామి గొప్ప మనసుకు పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి, కలపాల మురళీకృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ సొంత డబ్బుతో చిన్నారికి శస్త్రచికిత్స

కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఎంపీకి సమస్య వివరిస్తున్న బాధిత మహిళ

పట్టణంలోని పేద దళిత కుటుంబానికి చెందిన గొడ్ల ముత్యాలరావు, వినీత దంపతుల ఐదు నెలల పాపకు గుండెలో రంధ్రం ఉండడంతో ఆపరేషన్ చేయాలని, ఇందుకు సుమారు రూ.నాలుగు లక్షలు అవుతాయని వైద్యులు తెలపగా ఈ విషయాన్ని టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ దృష్టికి తీసుకొచ్చారు. గత నెల 27న జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ మహేష్‌కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో సిఎంఆర్‌ఎఫ్ నుంచి ఎంపీ ద్వారా రూ.1.7 లక్షలు మంజూరయ్యాయి. మిగిలిన డబ్బులు లేక వైద్యం చేయించలేకపోతున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఎంపీ అప్పటికప్పుడు స్థానిక ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు. డబ్బు విషయం తాను చూసుకుంటానని, ఆ చిన్నారికి వెంటనే వైద్యం చేయాలని కోరారు. ఐదు నెలల పాపాకు ఆపరేషన్ విజయవాడలోనే సాధ్యమవుతుందని స్థానిక ఆసుపత్రిలో చెప్పగా, చిన్నారిని విజయవాడ రమేష్ ఆసుపత్రికి తరలించగా అక్కడ కొన్నిరోజుల క్రితం విజయవంతంగా శస్త్రచికిత్స చేయగా సోమవారం డిశ్చార్జ్ చేశారు. చిన్నారి శాన్వి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బాలిక తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారి శాన్వి తల్లిదండ్రులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖపట్నంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం రాష్ట్ర అభివృద్ధిలో ఒక గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం గూగుల్ సంస్థ మధ్య మంగళవారం జరిగిన ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. పరిశ్రమలు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి వారు ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునే విధంగా కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సంస్థ రానున్న ఐదేళ్లలో విశాఖలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుందని తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా డిఎల్‌పిఒ అమ్మాజీ



ఎంఎల్‌ఎకు మొక్క అందిస్తున్న ప్రత్యేకాధికారి అమ్మాజీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిణిగా ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారిణి వై.అమ్మాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజును ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వివిధ శాఖలకు సంబంధించి అంశాలు, విజన్-2047, పి-4 కార్యక్రమాల అమలుపై చర్చించారు. మండలాభివృద్ధికి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పని చేయాలని ఎంఎల్‌ఎ ధర్మరాజు కోరారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ ఎంఎల్‌ఎకు మొక్కతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఉంగుటూరు మండల సంఘం అధ్యక్షుడు నేతల విజయ్‌కుమార్, చేబ్రోలు, కైకరం సెక్రటరీలు శ్రీనివాసరావు, నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యచంద్రరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మండవల్లి

దళిత ముద్దుబిడ్డ, దళితుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన మత్తే సూర్యచంద్రరావు మృతి దళిత జాతికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నోబుల్, కలిదిండి ఎఎంసి మాజీ ఛైర్మన్ అబ్రహం లింకన్ వీరబత్తిన సుధ అన్నారు. విజయవాడలో నివాసం ఉంటున్న సూర్యచంద్రరావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామమైన లోకుమూడిలో ఉంచారు. ప్రముఖ దళిత నాయకులు, పలు పార్టీలకు చెందిన నాయకులు సూర్యచంద్రరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరిగితే క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకుని నేనున్నానంటూ ధైర్యం చెప్పి పోరాటం చేసే పోరాట యోధుడు సూర్యచంద్రరావు అని కొనియాడారు. ఆయన మృతి పట్ల దళితులు, కైకలూరు నియోజకవర్గ ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం :టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ కార్యాలయంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మంగళవారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సిఎం తన సహాయ నిధి నుంచి చేయూత అందిస్తున్నారని చెప్పారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవడం ద్వారా ఆ కుటుంబాలకు సిఎం చంద్రబాబు ఆసరాగా నిలుస్తున్నారన్నారు. షేక్ ఫాతిమున్నిషాకు రూ.52,051, కోనా పద్మకు రూ.30,028, పోకల వీర రాఘవులుకు రూ.1.50 లక్షలు, చీమల రాముకు రూ.5,34,235, వరద నాగబాబుకు రూ.55,183 మొత్తం రూ.8,21,497 విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందించారు.

జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న చెప్పారు. పట్టణ పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో బిల్డింగ్ కాంట్రాక్టర్స్, వివిధ పార్టీలకు చెందిన నాయకులకు నూతన జిఎస్‌టి విధానంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ఒక వస్తువుపై జిఎస్‌టి తగ్గడంతో అనుబంధమైన అన్ని వస్తువులపై తగ్గుతుందని చెప్పారు.

టి.నరసాపురం : జిఎస్‌టి తగ్గింపుతో అన్ని తరగతుల ప్రజలకు మేలు చేకూరుతుందని మండల ప్రజా పరిషత్ అధికారి జి.మణికుమారి తెలిపారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ మణికుమారి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలోని సర్ సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో చాటపర్రు రోడ్డులోని వినాయక నగర్‌లో ఉన్న భాష్యం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారని ఆ స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు వివిధ కేటగిరిలో బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుపొందిన విద్యార్థులను వెస్ట్ జోన్ ఇన్‌ఛార్జి శ్రీమన్నారాయణరెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, స్కూల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి ప్రత్యేకంగా అభినందించారు.

3న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి నవంబర్ మూడో తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమ్మె చేయనున్నట్లు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును మంగళవారం ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌కు అందించారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమ్మె నోటీసును మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.